

సరసపాడులో పశువైద్య శిబిరం

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని దుర్గం పంచాయతీ సరసపాడు గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందించారు. వ్యాధులతో పశువుల మృతువాత అనే శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి పశువైద్య సిబ్బంది స్పందించారు. అనంతరం పశు వైద్య ధికారి వరప్రసాద్ మాట్లాడుతూ, పశువులు, మేకలకు, పెంపుడు జంతువులకు ఆరోగ్య పరమైన సమస్యలు వస్తే తక్షణమే వైద్యం సూచనలు, సలహాలు తీసుకోవాలని అన్నారు. పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలోని 260 పశువులకు ఎఫ్ఎమ్‌డి వాక్సిన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, బుజ్జిబాబు, బాలన్న, సోమ, సునీల్ పాల్గొన్నారు.



పశు మందులు ఇస్తున్న సిబ్బంది

రేపు మన్యం బంద్

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై గిరిజనుల ఆగ్రహం

ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనలు

ప్రమాణాల ఉల్లంఘనపై నోరువిప్పని ఏజెన్సీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -అనకాపల్లిప్రతినిధి:రాయలసీమ ప్రాంతంలోని బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ ఈ నెల 24న శాసనసభలో చేసిన తీర్మానంపై ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకుండా ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై గిరిజన సంఘం శుక్రవారం మన్యం బంద్‌కు పిలుపునిచ్చింది. ఇప్పటికే బంద్ జయప్రదంపై ఏజెన్సీ అంతటా విస్తృత ప్రచారం జరుగుతోంది. మరోవైపు ప్రభుత్వ నిర్ణయంపై గ్రామాల్లోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చడం కోసం బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నామన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. రద్దు చేసిన జిఒ 3 పునరుద్ధరణను మాత్రం రెండున్నరేళ్లుగా ఎందుకు పట్టించుకోవడం లేదని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన యువతకు ఉద్యోగ నియామకాల్లో నూరు శాతం రిజర్వేషన్ కల్పించిన జిఒ 3కు చట్టబద్ధత కల్పించడంలో ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకోలేదన్న విమర్శలున్నాయి.

ప్రమాణాల పాటింపేదీ ?

రాయలసీమ ప్రాంతంలోని బిసి - ఎలో ఉన్న బోయ/వాల్మీకిలను ఎస్‌టి హోదాలో చేర్చాలని తీర్మానం చేయడానికి ప్రభుత్వం కొన్ని ప్రమాణాలు పాటించాల్సివుంది. ఒక తెగనుకానీ, సమూహాలనుగానీ షెడ్యూల్ తెగలుగా గుర్తించేందుకు లోకూర్ కమిటీ కొన్ని ప్రమాణాలను నిర్దేశించింది. ఆ ప్రకారం.. ఆహార సేకరణ, పోడు వ్యవసాయం, ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, భాష, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, కళలు, ప్రత్యేక నివాసిత ప్రాంతం, విద్య, ఆరోగ్యం, ఆదాయం, వెనుకబాటుతనం వంటివన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. కానీ ప్రభుత్వం ఏదీ పట్టించుకోలేదు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శామ్యూల్ ఆనందకుమార్ సిఫార్సుల ప్రకారం తీర్మానం చేసింది తప్ప, తెగను గుర్తించేందుకు లోకూర్ కమిటీ చేసిన సిఫార్సులను గాలికొదిలేసింది. ప్రభుత్వం తనకు నచ్చిన వ్యక్తితో ఏకసభ్య కమిషన్‌ను నియమించి, ఆయనిచ్చిన నివేదిక ఆధారంగా తీర్మానం చేయడానికి వీల్లేదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం బీసీకి చెందిన బోయ/వాల్మీకిలకు గిరిజన తెగ లక్షణాలున్నాయని గిరిజన సంస్కృతి, పరిశోధన సంస్థ ఎటువంటి సిఫార్సూ చేయలేదు. కనీసం పరిశోధన సంస్థను ప్రభుత్వం సంప్రదించలేదు. కనీసం ఆ సంస్థ నుంచి ఏ సమాచారమూ, సూచనలూ తీసుకోనూలేదు. ఆంత్రోపాలాజికల్ సర్వే నిర్వహించకుండా ఇచ్చిన నివేదికకు విలువవుండదని పలువురు అంటున్నారు. గిరిజన తెగకు చెందినవారన్న ప్రాథమిక ఆధారాలేవీ బోయ/వాల్మీకిలకు లేనప్పటికీ ఎస్‌టి జాబితాలో చేర్చాలని తీర్మానం చేయడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై గిరిజన సలహా మండలి తీర్మానం కూడా లేదు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని తీర్మానం చేయడంపై పాడేరు, అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఫాల్గుణ, ఎంపీ మాధవి అభ్యంతరం చెప్పకపోవడంపై గిరిజనులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాజశేఖరరెడ్డి, చంద్రబాబు ప్రభుత్వాలు బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ప్రయత్నించి, గిరిజనుల వ్యతిరేకతతో వెనక్కుతగ్గారు. గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం తీర్మానం చేసి ఆదివాసీలపై దాడికి దిగింది. దీంతో ఏజెన్సీ అంతటా ఆగ్రహం వ్యక్తమవుతోంది.



పాడేరులో నిరసన చేపడుతున్న గిరిజన సంఘం నేతలు(ఫైల్)

గిరిజనులకు అన్యాయం



గిరిజనులకు ఉన్న సంస్కృతి, సామాజిక సంబంధాలు బోయ/వాల్మీకిలకు లేనందున వారిని గిరిజనులుగా గుర్తించేందుకు వీల్లేదు. అభివృద్ధి చెందిన బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చితే మారుమూలున్న గిరిజనులకు అన్యాయం జరుగుతుంది.

డాక్టర్ వివిఎన్‌వికె.శాస్త్రి,
విశ్రాంత గిరిజన సంస్కృతి, పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్

మాచ్‌ఖండ్‌లో ఆర్‌ఎల్‌ఎ స్టడీకి అనుమతి

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లకు ఆర్ఎల్ఏ (స్టడీకి) పరీక్షలకు అధికారుల నుంచి అనుమతులు మంజూరైనట్లు ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ బి.శ్రీధర్ వెల్లడించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒక్కొక్క యూనిట్ ఆర్ఎల్ఏ స్టడీ జరుగుతుందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఒక యూనిట్ స్టడీ పూర్తి కాగా ప్రస్తుతం నాలుగు, ఆరు, రెండు యూనిట్లు స్టడీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ రెండు స్టడీ పనులు పూర్తి చేసిన తర్వాత మిగతా యూనిట్లు ఆర్ఎల్ఏ స్టడీ చేయాలా, వద్దా, అనే విషయం నిర్ణయించవలసి ఉందని చెప్పారు. స్టడీ అనంతరం ఏవైనా యూనిట్లో ఇబ్బందులు ఉంటే పాత టెక్నాలజీ పార్టులు ఇప్పుడు దొరకడం కష్టమని, అందువల్ల యూనిట్లు మరమ్మతులు పూర్తికాక వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి మరింత జాప్యం జరుగుతుందని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో నిర్దేశించిన టార్గెట్లు ఏడాది చేరుకోలేని పరిస్థితిలో ఆర్ఎల్ఏ స్టడీ వద్దని తమ మేనేజ్మెంట్‌కి నివేదిక ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సివిల్ కెకెవి. ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్

సీలేరులో చిరుజల్లులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లు కురిశాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల కొద్ది రోజులుగా తక్కువ ఉష్ణోగ్రతలు ఉండగా, బుధవారం ఎండ తీవ్రత అధికంగా ఉంది. సీలేరులో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 36 డిగ్రీ ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు బెంబేలెత్తారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉష్ణోగ్రత అధికంగా ఉండి చిన్నపాటి వడగాల్పులు వీచాయి. మధ్యాహ్నం తరువాత మబ్బులతో కూడిన వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

సచివాలయ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రంలో గ్రామ సచివాలయ నిర్మాణ పనులను రేఖపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూనెం సరోజిని బుధవారం గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సచివాలయం వినియోగంలోకి వస్తే పరిపాలనపరంగా ఉన్న ఇబ్బందులు తీరుతాయని తెలిపారు. అన్నీ హంగులు పూర్తి చేసి ప్రజలను చేరువ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శివప్రసాద్, ఇంజనీరింగు అసిస్టెంట్ కుంజా అనిల్, వెల్ఫేర్ అసిస్టెంట్ బుచ్చిరాజు, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, డిప్యూటీ కమాండెంట్ రత్నమ్మ బుధవారం కంప్యూటర్ అందజేశారు. కళాశాలకు కంప్యూటర్ వితరణపై కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సాయిరాం, కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయిరాం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సిఆర్పిఎఫ్ పోలీసులు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా అనేక సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ డిఎస్‌పి (రాజమండ్రి) రత్నమ్మ బుధవారం ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - సీలేరు

జీకే వీధి మండలం దారకొండ సెక్టర్ లెవెల్‌లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అంగన్వాడీ సూపర్వైజర్ కృష్ణకుమారి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్ వారీగా లభ్యమయ్యే చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు తినడం వలన పౌష్టికాహారం లభ్యమవుతుందని తెలిపారు. దారకొండ పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్ఆర్ పౌష్టికాహార కిట్లలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కలుషిత ఆహారం తినడంతో..

8 మందికి అస్వస్థత

వృద్ధురాలు మృతి - నడిమివలసలో ఘటన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అరమ సబ్ సెంటర్ పరిధి నడిమివలస గ్రామంలో కలుషిత ఆహారం తినడంతో సుమారు 9 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వీరిని అరకులోయ ఏరియా హాస్పిటల్‌కు రాత్రి తరలించగా అక్కడ వైద్య సేవలు పొందుతూ పాంగి గున్నమ్మ (70)అనే వృద్ధురాలు మృతి చెందింది. గిరిజనుడు వంతల జయరాం (50), వంతల సూచన(9), వంతల కేవిల్ (4), వంతల శామ్యూల్ (6), వంతల ఇస్మాయిల్(2), వి.ఎలిసా(4),వి.ఎలిసా (9) యాకోబు (5) హాస్పిటల్లో వైద్యం పొందుతున్నారు. గ్రామంలో ఓ కార్యం నేపథ్యంలో మధ్యాహ్నం గ్రామస్తులు భోజనం చేశారు. కొద్ది గంటల తర్వాత సాయంత్రం వాంతులు, విరేచనాలతో గ్రామస్తులు భయాందోళనకు గురై హుటాహుటిన అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అస్వస్థతకు గురైన బాధితులను అరకులోయ ఏరియా హాస్పిటల్‌కు తరలించి వైద్య సేవలు అందిస్తుండగా పరిస్థితి విషమించి గున్నమ్మ అనే వృద్ధురాలు మృతి చెందినట్లు గ్రామస్తులు. తెలిపారు. వైద్యం పొందుతున్న వారిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఫుడ్ పాయిజనా లేక కలుషితమైన తాగునీటి తాగడంతో జరిగిందా అని అనేది తెలియాల్సి ఉంది. తక్షణమే ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందించాలని గ్రామస్తులు, చుట్టుపక్కల గిరిజనులు కోరుతున్నారు.

బాధితులకు గిరిజన సంఘం పరామర్శ

అరకులోయ రూరల్:అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందతున్న బాధితులను గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, మండల కార్యదర్శి పి.రామన్న, సీపీఎం మండల కార్యదర్శి కె.రామారావులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మృతి చెందిన పాంగి గునమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నడిమివలస గ్రామంలో మెడికల్ క్యాంపు వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



బాధితులను పరామర్శిస్తున్న గిరిజన సంఘం నేతలు

1న ఉద్యోగులకు వైద్యశిబిరం

ప్రజాశక్తి-పాడేరు: ఏప్రిల్ 1న విశాఖపట్నం గాయత్రీ విద్యా పరిషత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హల్త్ కేర్ అండ్ మెడికల్ టెక్నోలజీస్ ఆద్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు కలక్టరేట్ ఆవరణలో జరిగే ఈ ఉచిత వైద్య శిభిరాన్ని ప్రభుత్వ ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. ఈ వైద్య శిబిరంలో గాయత్రీ వైద్య కళాశాలలోని ప్రముఖ వైద్యులు పాల్గొంటారని, బిపి, షుగర్, ఇ.సి.జి, కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు.

చెరకు తోట దగ్ధం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని కొర్రాయి పంచాయతీ జాకరగూడ జంక్షన్ వద్ద సుమారు ఎకరం చెరకు పంటకు బుధవారం గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడంతో చెరకు పంట పూర్తిగా మంటలకు ఖాళీ దగ్ధమైనట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. పెట్టుబడి చేసి కష్టపడి సాగు చేసిన చెరుకుంట దగ్ధం కావడంతో బాధిత రైతు ఆర్థికంగా నష్టపోయాడు. సర్పంచ్ కొములు బాధితులను ఓదార్చారు. అధికారులు స్పందించి ఆర్థికంగా ఆదుకో వాలని సర్పంచ్ కొమ్ములు కోరారు.



దగ్ధమైన తోట




నినాదాలు చేస్తున్న గిరిజనులు

తాగునీటి సమస్యపై ధర్నా

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో కించాయి పంచాయతీ గుమ్మసిరగంపుట్టు గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కారం చేయాలని గ్రామ గిరిజన మహిళలు, గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం జూనియర్ అసిటెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ 1 పాటుబోయి సత్యనారాయణ, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎం శ్రీను మాట్లాడుతూ, గుమ్మసిరగంపుట్ గ్రామంలో మూడు నెలలుగా మంచినీటి సమస్య నెలకొందని, పరిష్కరించే నాధుడే లేడన్నారు. పరిష్కారం చేయాలని పాడేరు ఐటీడీఏ స్పందనలో ఫిర్యాదు చేసినా నేటికి అధికారుల్లో కనీస చలనం లేదని మండిపడ్డారు. గ్రామంలో 50 కుటుంబాలు నివసిస్తున్నాయని, గడిచిన రెండు నెలల నుండి తాగడానికి గుక్కెడు మంచినీరు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించకుంటే ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయంను ముట్టడి చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలతో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపికి గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి పార్టీకి ఆదివాసీలు తగిన గుణపాఠం చెప్పక తప్పదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆదివాసి చైర్పర్సన్, రాష్ట్ర కార్యదర్శి పి. శాంతకుమారి హెచ్చరించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం న్యాయ పోరాట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బోయ,వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్పించడానికి తీర్మానించడం విచారకరమన్నారు. తఈనెల 31న రాష్ట్రవ్యాప్త మన్యం ముందుకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు తెలుపుతున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పిసిసి రాష్ట్ర డెలిగేట్ పి.చిన్నస్వామి, మండల అధ్యక్షుడు జి.దయానిధి, ఉపాధ్యక్షుడు బి.సులోచన పాల్గొన్నారు.



దీక్ష చేపడుతున్న శాంతకుమారి

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-జి.మాడుగుల:స్థానిక కేజీబీవీ పాఠశాల, కళాశాలలో విద్యార్థినులు చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు. ఆరవ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసి గ్రూప్ కు 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. 7, 8, 9 తరగతులో పలు సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్థినిలు ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని లేదా పాఠశాలకు వస్తే తామే ఆన్లైన్ చేస్తామని ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు. వివరాలకు ఫోన్:9493529235, 9391024478 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కాంటూరుతో సంబంధం లేకుండా

ముంపు గ్రామాలన్నింటినీ ఆర్ఆర్ కింద గుర్తించాలి

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి- కూనవరం

కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ముంపు గ్రామాలన్నింటినీ ఆర్ అండ్ ఆర్ గ్రామాలుగా గుర్తించాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో కిరణ్ మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్ట్, ముంపు ప్రజల పట్ల నిర్లక్ష్య దోరణితో ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా వ్యవహరించి ముంపు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ రకంగా మాట్లాడడం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. జులై నెలలో వచ్చిన వరదలకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ముంపునకు గురైతే 41.5 కాంటూరులో ఉన్న గ్రామాలను మాత్రమే ఆర్ అండ్ ఆర్‌లోకి తీసుకోవడం విడ్డురంగా ఉందన్నారు. తక్షణమే కాంటూరుతో సంబంధం లేకుండా ముంపునకు గురైన ప్రతి గ్రామాన్ని ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ గ్రామాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ముంపు గ్రామాల ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, నాయకులు పాయం సత్యనారాయణ, బొగ్గా రామారావు, బాబు బొర్రయ్య, తెల్లం తమ్మయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, తలగాని నాగరాజు, జ్యోతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

1ప్రజాశక్తి-కొయ్యూరు

కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని ముల్లుమెట్ట గ్రామంలోని ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా మోడీ ప్రభుత్వం ప్రతి ఏటా దానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ వస్తుందని తెలిపారు. ఈ ఏడాది రూ.30 వేల కోట్లు కోత పెట్టిందన్నారు. దీనివల్ల గ్రామీణ కూలీలకు పని లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి.బొంజన్న, జె.శివశంకర్, జర్సింగి ప్రవీణ్, బి.కృష్ణ, బి.నాగేష్, తులబడ ప్రసాద్, చిట్టిన్న తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : కేంద్ర ప్రభుత్వం కార్మికులపై అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు పిలుపునిచ్చారు. బుధవారం అరకు వేలి గిరిజన సంఘం కార్యాలయంలో సిఐటియు మండల నాయకులు పాడి కొండలరావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కే మగ్గన్న, సింహాద్రి, రాజు, సుందర్‌రావు, బాలన్న, చిన్ని, ఆనంద్ పాల్గొన్నారు.

హుకుంపేట : ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమంలో కర్షకులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వెలుగు సిబ్బంది కోరారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద వెలుగు సిబ్బంది బుధవారం పోస్టర్లు విడుదల చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, పెన్షన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నేతలు . పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మల్లుమెట్టలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న అప్పలనాయుడు



హుకుంపేటలో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాగునీటి సదుపాయం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని పలు గ్రామాలలో తాగునీటి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే ఐటిడిఎ నిధులు మంజూరు చేసి తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఐటిడిఎ ఎపిఓకు సిపిఎం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ పెరుగుతున్న ఎండల వల్ల ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మాజీ, ఎంపీటీసీ జయసుధ, సర్పంచులు సోదే శంకర్, నాగమణి, వెంకమ్మ, సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో 'పోషణ్ పక్వాడ'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక ఐసీడీఎస్ సిడిపిఓ ఎల్.దేవమణి అధ్వర్యంలో స్థానిక పీహెచ్సీలో పోషణ పక్వాడ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ దేవమణి మాట్లాడుతూ రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ వంటల ద్వారా పోషకాలు ఎక్కువగా ఉంటాయో అవగాహన కల్పించారు. అనంతరం పోషక విలువలు కలిగిన వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి శ్రీదుర్గా, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అరుణలత, నాగ జయలక్ష్మి, అన్నపూర్ణ, అమ్మిరాజు, అమ్మాజీ, అంగన్వాడీ వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోరుబావి నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయతీ పరిధి మధ్య గుంపు గ్రామంలో పంచాయతీ నిధులతో చేపట్టనున్న బోరుబావి నిర్మాణ పనులను ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి, ఎంపీటీసీ ప్రదీప్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజలు నీళ్ళ కోసం నానా అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను తెలుసుకొని యుద్ధ ప్రాతిపదికన కొత్తగా బోరు వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కుంజ నాగిరెడ్డి, సచివాలయం సెక్రటరీ రామారావు సిబ్బంది పాల్గొన్నారు.



బోరుబావి నిర్మాణానికి పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

ఉత్తమ ఫలితాలకు ఉన్నత సాధన

- మొదటి విడతలోనే శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం
- ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థుల సన్నద్ధత

ప్రజాశక్తి -చింతూరు: ఏప్రిల్ మూడవ తేదీ నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాల సాధనకు చింతూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉన్నతమైన ప్రత్యేక బోధన నిర్వహిస్తున్నారు. ఈ ఉన్నత పాఠశాలలో పదో తరగతి తెలుగు మీడియంలో 61 మంది, ఇంగ్లీష్ మీడియంలో 33 మంది మొత్తంగా 94 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమౌతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లా విద్యాశాఖాధికారి నవీన భాషా నిర్దేశకత్వంలో స్థానిక హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రోజూ ఉదయం 8 గంటల నుండి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుండి 5 గంటల వరకు ప్రతిరోజు రెండు గంటలపాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. దీనికి అదనంగా రెగ్యులర్‌గా విద్యార్థులను చదివిస్తూ, సబ్జెక్టుల వారీగా వారి సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఒకవైపు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూనే, విద్యార్థుల స్థాయిని బట్టి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం ద్వారా పరీక్షలకు సన్నద్ధులను చేస్తున్నారు. పరీక్షలంటే భయం పోగొట్టి, వారిని అన్ని విధాలా సిద్ధం చేస్తున్నారు.

శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం



గతేడాది పదవ తరగతిలో 47శాతం ఉత్తీర్ణత సాధించాం. తర్వాత సప్లిమెంటరీ పరీక్షల్లో శతశాతం ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది అలాకాకుండా మొదటి విడతలోనే మంచి మార్కులతో శతశాతం ఫలితాల సాధన లక్ష్యంగా కృషి చేస్తున్నాం. సిలబస్ పూర్తి చేసి రివిజన్‌తోపాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల ప్రతిభకు సాన పెడుతున్నాం.

తుర్రం లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు.

ప్రత్యేక తరగతులతో మంచి ఫలితాలు



ప్రత్యేక తరగతులతో మంచి ఫలితాలు

పదవ తరగతి పరీక్షలకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ప్రయోజనకరంగా ఉన్నాయి. సందేహాలను నివృత్తి చేయడం, సబ్జెక్టుల వారీగా సంబంధిత ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం వేళల్లో తరగతులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. మంచి మార్కులతో ఉత్తీర్ణత తథ్యం.

- కె.సాత్విక, పదో తరగతి విద్యార్థి

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తా..



ప్రత్యేక తరగతుల బోధన ద్వారా సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలను ఉపాధ్యాయులను అడిగి, అక్కడికక్కడే నివృత్తి చేసుకుంటున్నాను. అర్థం కాని విషయాలను అడిగి తెలుసుకుని, నోట్ చేసుకుని మళ్లీ చదువుతూ పరీక్షకు సిద్ధమౌతున్నాను. మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధిస్తా.

కార్తీక్ చంద్ర, విద్యార్థి, చింతూరు.

'పది'ంతల కృషి



విద్యార్థినులను దగ్గరుండి చదివిస్తున్న హిందీ టీచర్

ప్రతి విద్యార్థి జీవితానికి పదో తరగతి పరీక్షలే పునాది. ఇక్కడే పటిష్టమైన పునాది ఏర్పరచుకుంటే తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, సుస్థిర జీవితంతోపాటు బంగారు భవిష్యత్‌ను ఏర్పాటు చేసుకునేందుకు వీలుంటుంది. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎక్కడ ఉన్నా 'పది' తీపి గురుతులే పదిలంగా ఉంటూ, స్ఫురణకు తెచ్చుకుంటే మధురానుభూతులను మిగులుస్తుంది. అటువంటి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమమైన మార్కులతో, శతశాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తుంటే, వారి తర్ఫీదు, శిక్షణలో అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు కందమామిడి బాలికల పాఠశాలలోని విద్యార్థులు సైతం కఠోరంగా శ్రమిస్తున్నారు.

- మంచి మార్కులతో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం
- ప్రణాళికాబద్ధంగా పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధత
- ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ
- కఠోరంగా శ్రమిస్తున్న కందమామిడి విద్యార్థినులు

ప్రజాశక్తి - పాడేరు టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మరో ఐదు రోజుల్లో వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పాడేరు మండలం కందమామిడి జిటిడబ్ల్యు ఆశ్రమ బాలికల పాఠశాలలో ఇప్పటికే సిలబస్‌లు పూర్తి చేసుకుని, వందరోజుల ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధమౌతున్నారు. ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణలో విద్యార్థినులు తమ ప్రతిభకు మరింత పదును పెట్టేందుకు రేయింబవళ్లు కష్టబడి చదువుతున్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల నైపుణ్యాలు,ప్రతిభను అంచనా వేస్తూ, విద్యార్థుల స్థాయిని బట్టి ప్రతిఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ తీర్చిదిద్దుతున్నారు. శతశాతం ఫలితాల సాధనతోపాటు ప్రతి ఒక్కరూ ఉత్తమమైన గ్రేడింగ్, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఈ ఏడాది ఐటిడిఎ నిర్దేశించిన ప్రత్యేక ప్రణాళిక ఆధారంగాప్రతి విద్యార్థినిపై టీచర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థులను దగ్గరుండి చదివిస్తూ, వారి చివరి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. పరీక్ష రాయడమేలాగో అన్న విషయం నుంచి, అధిక మార్కులతో ఉత్తీర్ణులు అయ్యేందుకు అవసరమైన మెలకువలు నేర్పుతున్నారు. విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని పోగొట్టి, వారిని చదువుతో పాటు మానసికంగా సన్నద్ధం చేస్తూ, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. ఈ ఏడాది కందమామిడి పాఠశాల నుంచి 91 మంది విద్యార్థినులు పదో తరగతి పరీక్షలకు హాజరౌతుండగా, పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ వారిలో పెరుగుతోన్న టెన్షన్‌ను పసిగట్టి, ఎటువంటి ఒత్తిడి, భయం లేకుండా ఏలా పరీక్షలు రాయాలే సబ్జెక్టుల వారీగా సంబంధిత ఉపాధ్యాయులు దిశానిర్దేశం చేస్తూ వారిలో టెన్షన్‌ను పోగొట్టి ధైర్యం నింపుతున్నారు.

లక్ష్యసాధనకు ప్రత్యేక తర్ఫీదు

పదిలో మంచిమార్కులతో శతశాతం ఫలితాలకు ప్రత్యేక తరగతులతో పాటు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా రోజువారి పరీక్షల నిర్వహణలో విద్యార్థుల్లోని ప్రతిభను మెరుగుపరచడంతోపాటు పరీక్షంటే భయాన్ని పోగొట్టేందుకు కృషి చేస్తున్నారు. చదువుతోపాటు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చేస్తున్న కృషితో అనుకున్న ఫలితాలను సాధిస్తామన్న నమ్మకం ఉంది.

-గంగాబాయి, హెచ్ఎం

మారిన పరీక్ష విధానానికి అనుగుణంగా శిక్షణ



11 పేపర్లకు బదులుగా ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఆరు సబ్జెక్టులు, ఆరు పేపర్లకు అనుగుణంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రానికి వేర్వేరుగా ఉండే పేపర్లను ఇపుడు ఒక్కటిగా చేయడంతో దానికి అనుగుణంగా విద్యార్థులకు అవగాహన కల్పించి శిక్షణనిచ్చి. చదివిస్తున్నాం.

కోడా చంప, సైన్స్ టీచర్
జిటిడబ్ల్యు బాలికల ఆశ్రమ పాఠశాల

రోజువారీ పరీక్షలతో రాటుదేలాం



సబ్జెక్టుల వారీగా టీచర్స్ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా ఉపాధ్యాయులిచ్చే సలహాలు, సూచనలు పాటిస్తూ చదవడం ద్వారా అన్ని సబ్జెక్టుల్లో రాటుదేలాం. టీచర్స్ పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసేందుకు కష్టించి చదువుతున్నాం.

-ఎల్.గీత, పదో తరగతి విద్యార్థిని,
జిటిడబ్ల్యు బాలికల ఆశ్రమ పాఠశాల

పరీక్షలంటే భయం పోయింది..



టీచర్స్ అందించిన స్ఫూర్తి, ధైర్యం, ఆత్మస్థైర్యంతో చదువుతున్నాం. పబ్లిక్ పరీక్షలంటే ఎక్కడో ఉన్న భయం పూర్తిగా పోయింది. ఉపాధ్యాయుల సూచనల మేరకు చక్కగా చదువుతున్నా. మంచి మార్కులతో పాసౌతాను.

-డి.ధనలక్ష్మి,
పదో తరగతి విద్యార్థిని,
జిటిడబ్ల్యు బాలికల ఆశ్రమ పాఠశాల,
కందమామిడి.

ప్రయోజనకరంగా ప్రత్యేక తరగతులు



పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. వాటితో నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటున్నాం. పరీక్షల్లో మంచి మార్కులతో విజయం సాధించాలని పట్టుదలతో చదువుతున్నాం.

-వి.ధనలక్ష్మి,
పదో తరగతి విద్యార్థిని
జిటిడబ్ల్యు బాలికల ఆశ్రమ పాఠశాల

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం





విఆర్.పురం, రాజవొమ్మంగిల్లో టిడిపి ఆవిర్భావ దినోత్సవంలో టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పాడేరులో ఆ పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్‌టిఆర్‌విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్‌టిఆర్ సేవలను కొనియాడారు. సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టిన ఘనత టిడిపిదేనని చెప్పారు. బడుగు బలహీన వర్గాలకు ఎన్‌టిఆర్ పెద్దపీట వేశారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు, వంజంగి కాంతమ్మ, బొర్రా విజయరాణి, రొబ్బి రాము, చీకటి మధు, కోడా వెంకట సురేష్ కుమార్, జ్యోతి కిరణ్, గిరి, శంకర్ పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: టిడిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోడ్ల జంక్షన్ వద్ద టిడిపి జెండాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు ఎగురవేశారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్టీ సెల్ పార్లమెంట్ కోశాధికారి కే.సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదబయలు రూరల్: మండలంలోని లక్ష్మీపేట గ్రామం లో అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అధ్వర్యంలో జెండాను ఎగుర వేశారు. తారక రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి.రామారావు, కె.గిరిబాబు, ఎన్.సూర్యనారాయణ, చిరంజీవి పాల్గొన్నారు.

అడ్డతీగల : మండల కేంద్రం అడ్డతీగలలో టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు జర్త వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అడ్డతీగల, ఎల్లవరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు రొట్టెలు, బిస్కెట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు వడ్డీ రాంబాబు, శ్రీకాంత్, తోకలు సత్తిబాబు, తేలు చిన్న, చదువు రామకృష్ణ పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో దుర్గాదేవి షెడ్‌లో టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. టిడిపి నాయకులు బొర్రా కృష్ణ, నక్క తిరుమల రావు, పంచాయతీ ఇన్‌ఛార్జి సర్పంచ్ కే.వల్లి ప్రసాద్, సన్యాసిరావు, రాము పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు టిడిపి కార్యాలయంలో ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాలవేసి, జెండాను ఎగరవేశారు. అనంతరం చింతూరు ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇల్ల చిన్నారెడ్డి, పొదిలి రామారావు, ఓబులునేని రామారావు చౌదరి, శ్రీరామ్‌రెడ్డి, పసుపులేటి సల్మాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : స్థానిక రేఖపల్లి జంక్షన్‌లో టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్ ఆ పార్టీ జండాను ఆవిష్కరించారు. అనంతరం విఆర్ పురం జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు చేతుల మీదుగా రేఖపల్లి హాస్పటల్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బురక కన్నారావు, ఎంపీటీసీ వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, గొంది చంద్రయ్య, పెందుర్తి సుదర్శన్‌రావు, రాజేంద్ర ప్రసాద్, బొర్రా నరేష్ కుమార్, పాయం రామారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండల కేంద్రం మారేడుమిల్లిలో టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి పోడియం శ్రీనుబాబు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ పల్లాల లక్ష్మి భూపతి రెడ్డి కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రి సన్యాసిరెడ్డి, దూడ సువర్ణ కర్ణ కుమార్, సార్ల మంగిరెడ్డి, అందాల సూర్యనారాయణ రెడ్డి, భీశెట్టి అప్పాజీ, షేక్ సుభాన్, షేక్ బషీర్, రేవుల జానకి రెడ్డి, దూడ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక అల్లూరి సెంటర్‌లో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన డింబకేశ్వరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు డి శివ రామచంద్ర రాజు, పి.సత్యనారాయణ, జె మధు, బాలరాజు, గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యం బంద్ జయప్రదానికి విస్తృత ప్రచారం



పాడేరులో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నేతలు

బోయ/వాల్మీకి, బెంతులు సహా పలు 'బిసి ఏ' కేటగిరీలోని కులాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ రాష్ట్ర కేబినెట్, వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 31న రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌కు గిరిజన సంఘం పిలుపునిచ్చిన నేపథ్యంలో బంద్ విజయవంతం చేయాలని కోరుతూ గిరిజన సంఘం ,ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగాప్రచారం నిర్వహించారు. బంద్ విజయవంతానికి ఉద్యోగులు, వ్యాపారులు, యువత, మేథావులు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కరపత్రాలు పంచుతూ, వాల్‌పోస్టర్లు అతికిస్తూ ప్రచారం నిర్వహించారు. బంద్‌కు సిపిఎం, యుటిఎఫ్, గిరిజన ఉద్యోగులతోపాటు పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి.

ప్రజాశక్తి -పాడేరు: బోయ/వాల్మీకుల్ని ఎస్‌టి జాబితాలో చేరుస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. ఈ నెల 31న ఏజెన్సీ బంద్ నేపథ్యంలో బుధవారం చింతపల్లి వారపు సంతలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బంద్‌కు వ్యాపారవర్గాలు, ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిస్తూ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అనంతరం ధనుంజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గిరిజనులతో ఆటలాడుతున్నారని మండిపడ్డారు. గిరిజనుల సహనాన్ని పరీక్షించక తక్షణమే తీర్మానాన్ని రద్దు చేయాలని, లేకుంటే ఏజెన్సీ గిరిజనుల పోరాట సత్తా ఏంటో చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, సింహాచలం, రాంబాబు ఎస్ఎఫ్ఐ చింతపల్లి డివిజన్ కార్యదర్శి పాంగి జీవన్ కృష్ణ, ప్రసాద్, ఎస్ఎఫ్ఐ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఈనెల 31న గిరిజనసంఘం పిలుపునిచ్చిన మన్యం బంద్ ను జయప్రదం చేయాలని కోరుతూ కించమండ వారపుసంతలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో విస్తత ప్రచారం నిర్వహించారు. బంద్‌లో వ్యాపారులు, ఉద్యోగులు, యువత, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరుతూ దుకాణదారులు, స్టేట్‌బ్యాంకు, ఆశ్రమ పాఠశాల, ఇతర ప్రదేశాల్లో కరపత్రాలను పుంచుతూ ప్రచారం నిర్వహించారు. గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు, బి.కోటేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

హుకుంపేట: బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ గిరిజన సంఘం,ఐద్వా ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్.హైమావతి ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలు, కార్మికులను బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న 31న ఏజెన్సీ బంద్‌ను మేధావులు గిరిజనులు, గిరిజన సంఘాలు ప్రజాసంఘాలు ఖండించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి టి కృష్ణారావు, వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు పాల్గొన్నారు.

ఎటపాక : 31న జరిగే మన్యం బంద్‌కు సహకరించాలని కోరుతూ. మండల కేంద్రంలోని మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయం, కస్తూర్బా పాఠశాల, గ్రామ సచివాలయాల్లో గిరిజనసంఘం మండల కమిటీ సభ్యులు నక్కా సూరిబాబు, బుద్ధుల భద్రయ్య, సవలం రాము, ఇతర నేతలు వినతిపత్రం అందజేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాలు, దుకాణాలు మూసేసి బంద్ పాటించాలని కోరారు.

అడ్డతీగల : మండల పరిషత్ కార్యాలయం వద్ద గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపిటిసిలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి మన్యం బంద్ విజయవంతం చేయాలని కోరారు. రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షులు ఐ.రమణ పాల్గొన్నారు

రాజవొమ్మంగి: గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ జయప్రదం చేయాలని మండల కేంద్రంలో కరపత్రాలు పంచుతూ, వాల్‌పోస్టర్లు అంటించి, విస్తత ప్రచారం చేశారు. బంద్‌కు సహకరించాలని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకుల్లోని సిబ్బంది, వర్తక,వ్యాపారస్తులు కలిసి విన్నవించారు. తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారికి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి కొండ్ల సూరిబాబు, ఆదివాసీ జెఎసి నేతలు వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, ఈకా ఆది నారాయణ, బి రామకృష్ణ, పాండవుల సత్యనారాయణ, కాళ్ళ రాజబాబు, వి అప్పారావు పాల్గొన్నారు.

చింతూరు : మన్యం బంద్ జయప్రదం చేయాలని కోరుతూ చింతూరు గిరిజన బాలుర కళాశాల వసతి గృహం వద్ద బంద్ పోస్టర్‌ను గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కుంజా సీతారామయ్య. వేక గోవింద్, మీడియం నాగమణి సర్పంచ్, కారం నాగేష్ ఉదయం లక్ష్మణ్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్ పురం: గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో మన్యం బంద్ జయప్రదం చేయాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పాఠశాలలు సిబ్బంది, వర్తక, వ్యాపారస్తులను కలిసిసహకరించాలని కోరారు. రేఖపల్లి క్రికెట్ గ్రౌండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. గిరిజన సంఘం ఆదివాసీ జెఎసి నేతలు పాల్గొన్నారుప

కొయ్యూరు : మన్యం బంద్‌లో గిరిజనులు, విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, గిరిజన శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని జయప్రదం చెయ్యాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సరుమూర్తి సూరిబాబు కోరారు. బోయ/వాల్మీకులు, బెంతులకు గిరిజన తెగల్లో కలపడం వల్ల నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విస్తృత ప్రచారం నిర్వహించారు.

చింతూరులో జెఎసి బైక్ ర్యాలీ

చింతూరు : మన్యం బంద్ జయప్రదాన్ని కోరుతూ చింతూరు మండల జెఎసి ఆధ్వర్యంలో శెట్టి పెట్రోల్ బంక్ నుంచి చింతూరు ఐటిడిఎ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఐటిడిఎ అధికారులు, ఉద్యోగులను కలిసి, కరపత్రాలను అందజేసి బంద్‌కు సహకరించాలని కోరారు ఆదివాసీ జెఎసి నేతలు సీసం రమేష్,. కోసం సుబ్బారావు. జల్లి నరేష్, జిల్లా చిన్నంరెడ్డి, కొండా కృష్ణ, బుగ్గ ముత్తయ్య, పురుష బ్రహ్మయ్య, బలరాం, కలిపి గణేష్, మానే రాంప్రసాద్, సింగయ్య, ఎచ్చర్ల పాల్గొన్నారు.



చింతూరులో బైక్ ర్యాలీ



రాజవొమ్మంగిలో...



విఆర్.పురంలో...



హుకుంపేటలో...



డుంబ్రిగుడలో...

వైసిపి నుంచి వైదొలుగుతాం



పంచాయతీ సమావేశంలో తీర్మానం చేస్తున్న సర్పంచ్

అరకులోయ: బోయ/ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే తామంతా వైసిపి నుంచి వైదొలుగుతామని మాడగడ వైసిపి సర్పంచ్ కేడ్డి జ్యోతి స్పష్టం చేశారు.బుధవారం మాడగడ సచివాలయంలో సర్పంచ్ .జ్యోతి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, రాష్ట్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మానం ప్రతులను రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ప్రభుత్వానికి పంపుతామన్నారు. ముఖ్యమంత్రి పునరాలోచించి నిర్ణయాన్ని వాపసు చేయకుంటే, తాము వైసిపి గుడ్‌బై చెప్పక తప్పదని హెచ్చరించారు.వైసిపి సీనియర్ నాయకుడు మండ్యా, కేడ్డి బాలరాజు ఆ పంచాయతీ వార్డు మెంబర్లు, గిరిజనులు పాల్గొన్నారు.

పలు పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు, సంఘీభావం

యుటిఎఫ్ సంఘీభావం

పాడేరు టౌన్: బోయ/వాల్మీకి సహా అనుబంధ కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలంటూ వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 31న గిరిజన సంఘం చేపట్టే మన్యం బంద్‌కు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.మహేష్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేరిస్తే, నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజనుల చట్టాలు, రిజర్వేషన్లు అసలైన వారికి దక్కకుండా పోవడం తథ్యమన్నారు. గిరిజనుల మనుగడకు ప్రమాదరకమైన ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ అల్లూరి జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు టి.చిట్టిబాబు, అధ్యక్షులు వై.విల్సన్ బాబు, సహా అధ్యక్షులు సిహెచ్ నాగేశ్వరరావు, ఎం.కవిత, కోశాధికారి, కె.కష్ణ, కార్యదర్శులు పి.కష్ణయ్య, కె.ఆదిరెడ్డి, కె.రఘునాథ్, ఎం.ధర్మారావు, యు.వెంకట్ నారాయణ, ఎస్.రాజు బాబు, పి.దేముడు తదితరులు ప్రకటించి, బంద్‌కు మద్దతు తెలిపారు.

బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు

ఎటపాక : గిరిజన సంఘాల ఆధ్వర్యంలో 31న మన్యం బంద్‌కు సిపిఎం పూర్తి మద్దతునిస్తున్నట్లు ఆపార్టీ మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు బంద్‌లో పాల్గొనాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గిరిజన ఉద్యోగుల సంఘం మద్దతు

జి.మాడుగుల : ఈనెల 31న మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం పిలుపునిచ్చారు. బుధవారం జి.మాడుగులలో నిర్వహించిన అఖిల పక్ష జెఎసి సమావేశం నిర్వహించి, బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మిక, కర్షకులు, యువత, మహిళలు, మేథావులు ఇలా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి నేత చిట్టిబాబు జన సేన నేత భీమన్న యువకులు పాల్గొన్నారు

మన్యం బంద్‌కు అఖిలపక్షాల మద్దతు

పెదబయలు : బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 31న గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మన్యం బంద్‌కు టిడిపి, జనసేన, సిపిఎం ఇతర పార్టీలు సంఘీభావం తెలిపాయి. బుధవారం జెఎసి నేతలకు సంఘీభావం తెలిపిన అఖిలపక్ష నేతలు బంద్‌కు ప్రజలంతా సహకరించాలని కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలు, వర్తక, వాణిజ్యసంస్థలు బంద్‌లో పాల్గొని జయప్రదంచేయాలని కోరారు.